
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు


బుధవారం 15 అక్టోబరు 2025

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థికి అభినందనలు

తంగళ్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో క్రికెట్ జిల్లా జట్టుకు ఎంపికైన తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన పాలకుర్తి ఆశ్రినిత సాయి అనే విద్యార్థినిని జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మునిగేల రాజు అభినందించి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక అవ్వాలని ఆకాంక్షిస్తు మార్కెట్ కమిటి డైరెక్టర్ గుగ్గిళ్ల రాములు, గడ్డమీది శ్రీనివాస్, సంచుల కిషన్, కూనవేని వినోద్, కొల వినేష్, గుగ్గిళ్ల శరత్, గుగ్గిళ్ల వెంకటేష్, నిహంత్, అభి, శివ తదితరులు అభినందించారు.

44 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం

- అజ్ఞాతాన్ని వీడిన మల్లోజుల వేణుగోపాల్‌రావు
- దళ సభ్యుడి నుంచి పొలిట్ బ్యూరో వరకు.. ఎదిగిన విప్లవ నేత



మల్లోజుల వేణుగోపాల్ రావు (ఫైల్)

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అజ్ఞాతాన్ని వీడారు. మంగళవారం 60 మంది సహచరులతో కలిసి మహారాష్ట్ర గడ్చిరోలిలో పోలీసులకు లొంగిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన జ్ఞాపకాలను ఉమ్మడి జిల్లా వాసులు నెమరువేసుకుంటున్నారు.. అన్న మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీని స్ఫూర్తిగా తీసుకున్న వేణుగోపాల్‌రావు 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారు. అనంతరం అంచలంచెలుగా ఎదిగారు. సాహిత్యాభి రుచి ఉన్న వేణుగోపాల్‌రావు సాధన అనే కలం పేరిట కవిత్వం రాసేవారు. ఉద్యమంలోకి వెళ్లిన తన కుమారులను చూడాలని కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రావు తల్లి మల్లోజుల మధురమ్మ జీవితాంతం ఎదురు చూశారు. 2011లో కిషన్‌జీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. 2022 అక్టోబరులో మల్లోజుల మధురమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. 44 ఏళ్ల క్రితం ఉద్యమంలోకి వెళ్లిన వేణుగోపాల్‌రావు ఇప్పటివరకు ఇంటి ముఖం చూడలేదు. ప్రస్తుతం ఆయన పోలీసులకు లొంగిపోవడాన్ని కుటుంబసభ్యులు స్వాగతిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి

6



పారదర్శకంగా చెల్లింపులు

- ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో ఏఐ టెక్నాలజీ
- ఖాతాలో పొరపాటు జరిగితే ఈ-మెయిల్‌కు సమాచారం
- జిల్లాలో లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 44.98 కోట్లు జమ



పూర్తయిన ఇల్లు

జిల్లాలో వివిధ దశల్లో 3836 ఇళ్ల నిర్మాణాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు విడతల్లో 7918 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 5332 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు. 3836 ఇళ్లు ప్రారంభించారు. ఇప్పటివరకు మూడు ఇళ్లు పూర్తిచేశారు. బేస్మెంట్ స్థాయిలో 2282 ఇళ్లు, గోడల స్థాయిలో 901 ఇళ్లు, స్లాబ్ స్థాయిలో 656 ఇళ్లు ఉన్నాయి. కోనరావుపేట, తంగళ్ళపల్లి, వీర్నపల్లి మండలాల్లో మూడు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.44.98 కోట్ల నిధులను జమ చేశారు. జిల్లాలో 70 శాతం ఇల్లు గ్రౌండింగ్ పూర్తి చేశారు.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి..

మండలం	మంజూరైనవి	ముగ్గు పోసినవి	నిర్మాణంలో ఉన్నవి
బోయిన్‌పల్లి	820	570	410
చందుర్తి	525	409	232
ఇల్లంతకుంట	805	559	413
గంభీరావుపేట	648	375	272
కోనరావుపేట	562	448	338
ముస్తాబాద్	574	405	301
రుద్రంగి	377	206	112
సిరిసిల్ల మున్సిపాలిటీ	882	493	364
తంగళ్ళపల్లి	602	444	342
వీర్నపల్లి	259	157	95
వేములవాడ	389	227	156
వేములవాడ మున్సిపాలిటీ	484	332	261
వేములవాడ రూరల్	348	285	214
ఎల్లారెడ్డిపేట	643	422	327
మొత్తం	7918	5332	3836

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు ఎంపిక నుంచి మంజూరు వరకు అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తున్నారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో పొరపాట్లు జరగకుండా ఏఐ టెక్నాలజీ కూడా ఉపయోగించే విధంగా యాప్‌ను అప్డేట్ చేస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసే సమయంలో జరిగిన పొరపాట్ల వల్ల ఆయా బ్యాంకుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. దీంతో డబ్బులు ఇతర ఖాతాల్లోకి వెళ్తున్నాయనే ఫిర్యాదులు రావడంతో గృహనిర్మాణ శాఖ అధికారులు ఆధార్ నంబర్లతో బిల్లు చెల్లింపు జరిగే సమయంలో లబ్ధిదారుల పేరును పరి శీలించే విధంగా చర్యలు చేపట్టారు. ఆధార్ నంబర్‌తో పాటు లబ్ధిదారు ల పేరు, ఇంటి నంబర్‌తో సరిచూసే విధంగా మార్పులు తెచ్చారు. ఖాతాలో పొరపాటు జరిగితే ఈ-మెయిల్‌కు సమాచారం వెళ్లనుంది.



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు

బిల్లుల చెల్లింపు ఆలస్యం కాకుండా యాప్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లింకులు బిల్లుల చెల్లిం పులో ఆలస్యం కాకుండా అధికారులు గృహనిర్మాణ శాఖ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన నాటి నుంచి పునా ది, గోడలు, స్లాబ్ వంటి వివిధ దశల్లో ఉన్నప్పుడు అధికారులు, సిబ్బంది ఫొటోలు తీసి మొబైల్ యాప్ లో నమోదు చేయడం ద్వారా ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో లబ్ధి దారులు కూడా నేరుగా తమ ఇంటి నిర్మాణ దశలను కూడా అప్లోడ్ చేయవచ్చు. దీనిపై లబ్ధిదారులకు అధి కారుల అవగాహన కలిపిస్తున్నారు. యాప్‌ను ముం దుగా మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని తర్వాత లాగిన్ లోకి వెళ్లాలి. డాష్ బోర్డులోకి వెళ్లి లబ్ధిదారుడి పేరు, మొబైల్ నంబర్,

మిగతా 8వ పేజీలో

స్థానిక అవసరాలకు ఇసుక అందించాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన బీజేపీ నాయకులు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన బీజేపీ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో స్థానిక అవసరాల కోసం ఇసుకను తీసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, పట్టణ మాజీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌లు కోరారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ ఎం. హరితను కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో భవన నిర్మాణ రంగంలో స్థానిక అవసరాలకు ఇసుక ఇవ్వకపోవడం వల్ల పనులు లేక అనేక మంది కార్మికులు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అనుమతి పత్రాలను అందించిందని, కానీ వారికి ఇసుకను ఇవ్వకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ స్పందించి ఇసుకతోపాటు మట్టికి కూడా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కైలాస్, ఎర్రం విజయ్, దూడం శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిరిసిల్ల డిపో రిటైర్డ్ ఉద్యోగుల కమిటీ..

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్‌ఆర్టీసీ సిరిసిల్ల డిపో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో అసోసియేషన్ సభ్యుల సమావేశం జరిగింది. అనంతరం టీజీఎస్‌ఆర్టీసీ సిరిసిల్ల డిపో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు ఎం లక్ష్మన్, కార్యదర్శి డీ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు పీ వేణు గోపాలచారి, కోశాధికారి టీ దేవయ్య, ముఖ్య సలహాదారులు ఎం లక్ష్మీకాంతం, ఎన్ మనోహర్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని సభ్యులు పూలమాలలతో సన్మానించి అభినందించారు.

18న జిల్లా స్థాయి జూనియర్స్ యోగా పోటీలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలో ఈనెల 18న జిల్లాస్థాయి జూనియర్స్ యోగా పోటీలను నిర్వహించనున్నట్లు మంగళవారం యోగా అసోసియేషన్ సభ్యులు పీ దేవయ్య, బీ అశోక్, యూ శ్రీనివాస్ తెలిపారు. బాలబాలికలను వివిధ వయస్సుల వారీగా, సిలబస్ అనుసరించి సంసిద్ధం చేసుకొని పోటీలకు తీసుకరావాలని సూచించారు. త్వరలో పోటీల వేదికను ప్రకటిస్తామని,వివరాలకు 9989272428, 9381865340, 9492789244 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు రాజన్న ఆలయానికి శైలజరామయ్యార్ రాక..?

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయానికి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యా ర్ రానున్నట్లు తెలిసింది. ఈనెల 19, 20వ తేదీల్లో శృంగేరి పీఠాధిపతి విధుశే ఖర భారతిశర్మస్వామి రానున్న నేపథ్యంలో ముందస్తుగా రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను పరిశీలించనున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణపై సమీక్షించనున్నట్లు తెలిసింది.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

- ఎస్పీ మహేష్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అమరులైన పోలీసుల జ్ఞాపకార్థం ఈనెల21న నిర్వహించే ఫ్లాగ్ డే సందర్బంగా పోలీస్ రిలే టెడ్ అంశంమీద ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం తీయడానికి ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ముందుకు రావాలని ఎస్పీ మహేష్ బి. గీతే ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా తీసిన మూడు ఫొటోలు 3నిమిషాలు గల షార్ట్‌ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీ సాయంత్రంలోగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పీఆర్వోకు అందజేయాలన్నారు. ఫొటోలు, షార్ట్ ఫిలింను పెన్ డ్రైవ్‌లో పూర్తి వివరాలతో అందజేయలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలను, ఫొటోలను రాష్ట్ర స్థాయి పోటీలకు డీజీపీ కార్యాలయానికి పంపిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8712656431 సెల్ నంబర్‌లో పీఆర్వోను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంపై వీడియో కాన్ఫరెన్స్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.హరితతో మాట్లాడారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వారి పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేయడానికి వీలులేదని స్పష్టంచేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమానులతో సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. సామాజిక బాధ్యతగా భావించి విద్యారంగంపై ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం క్రమపద్ధతిలో విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో జరుగుతున్న పాఠ్యాంశాల బోధన, వసతులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రైవేటు స్కూల్స్‌తో బెస్ట్ అవైలబుల్ స్కూల్ కింద ఎంఓయూ చేసుకునే సమయంలోనే ఫీజులకు సంబంధించిన అంశాలు ఉంటాయనే విషయాన్ని యజమానులకు తెలపాలని సూచించారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఇబ్బందులు కలగకుండా చర్యలు : కలెక్టర్

జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఏడు ఉండగా 338 మంది విద్యార్థులు చదువుతున్నారని, అలాగే ఎస్టీ విద్యార్థులకు ఒక స్కూల్ ఉండగా 35 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ తెలిపారు. విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి వినోద్‌కుమార్, డీఎస్‌సీడీవో రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యావంతులుగా ఎదగాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు బీ పుష్పలత



విద్యార్థికి బహుమతి అందిస్తున్న జిల్లా అధ్యక్షురాలు పుష్పలత

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికలు సురక్షితంగా విద్యావంతులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు బీ పుష్పలత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు బీ పుష్పలత మాట్లాడారు. బాలికలు సురక్షితంగా విద్యావంతులుగా స్వయం సమర్థులుగా ఎదగడానికి సమాజంలోని ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమాజంలో ప్రతి బాలిక గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉందన్నారు. చట్టాలపై ప్రతి మహిళ అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి రాధిక జైస్వాల్ మాట్లాడుతూ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలకు సంబంధించిన బహుమతులు జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ, తెలంగాణ రాష్ట్ర లీగల సర్వీసెస్ అథారిటీ ఏఈజీఐఎస్ కింద స్పాన్సర్ చేయబడిందన్నారు. అనంతరం జిల్లా న్యాయసేధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటిలలో విజేతలైన విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాల బీ పుష్పలత బహుమతులను అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఎస్ వినీతరెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోతిలాల్, నాయవాదులు వేణు, అంజనేయులు లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారులు గ్రామాల్లో పర్యటించాలి..



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

గంభీరావుపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించాలని ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ మహేష్ బి గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను, స్టేషన్ రికార్డును పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను రివ్యూ చేసి స్టేషన్ పరిధిలోని కేసుల నమోదు, శాంతి భద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పోలీస్ విధులు ఉండాలని అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రజా సమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలన్నారు. ప్రధానంగా విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. గ్రామస్థాయిలో ఇన్‌ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో రౌడి షీటర్‌లను తనిఖీ చేయాలని, ప్రతి రోజు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సిబ్బందికి ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

- బీజేపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి)): బీజేపీ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ ఆవరణలో భక్తులకు ఎల్ఈడీ స్క్రీన్‌లతో దర్శనం కల్పిస్తామని వచ్చిన ప్రకటనను స్వాగతిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం ముందు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలు, చేపట్టిన కార్యక్రమాలతోనే పూజలను రాజన్న ఆలయానికి మార్చారని అన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా విజయవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, శ్రీధర్, సంతోష్‌బాబు, మల్లేశం, శేఖర్, కనుకయ్య తదితరులు ఉన్నారు.

- సిరిసిల్ల రూరల్ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం స్వాగతిస్తున్నామని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలిసురేష్, నాయకులు కోడం వినయ్, మోర రవి, దూడం సురేష్, వంగ దేవేందర్‌రెడ్డి, మెర్గు శ్రీనివాస్, సిద్ధి దేవరాజు, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారులుగా నియమించడం సరికాదు

వేములవాడ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల తనిఖీ నిమిత్తం ఉపాధ్యాయులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, ఇది పాఠశాల విద్యారంగానికి తిరోగమన చర్యగా భావిస్తున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, వంగ తిరుపతిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాలలో విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు పర్యవేక్షణల పేరుతో పాఠశాలకు దూరంగా ఉంటే, విద్యాబోధన కుంటుపడుతుందని, పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో లక్ష్యం పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 1473మంది ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి విద్యార్థులకు విద్యా బోధన నుంచి దూరం చేయడమేనని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రమోషన్‌ల ద్వారా ఖాళీగా ఏర్పడిన ఉపాధ్యాయ పోస్టుల నియామకాలు చేపట్టి, విద్యాబోధన కుంటుపడకుండా చూడాలని, ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించకుండా విద్యా బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏకీకృత సర్వీసురూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, తద్వారా పాఠశాలలను వారి ద్వారా పర్యవేక్షణ చేయాలని కోరారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుబ్బపల్లిలో ఓ ఇంట్లో నిల్వ చేసిన 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి వివరాల ప్రకారం.. దుబ్బపల్లిలోని కర్రె గంగారాం కొంత కాలంగా మహారాష్ట్రలోని పౌల్ట్రీ ఫాంలకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న సీఐ కొద్ది రోజులుగా నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో సోమవారం దుబ్బపల్లిలోని గంగారాం ఇంట్లో సోదాలు చేశారు. 629 బస్తాలలో 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలు గుర్తించారు. ఇంటి యజమాని గంగారాంను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. గంగారం కరీంనగర్ చుట్టుపక్కల ప్రజల వద్ద తక్కువ ధరకు పీడీఎస్ బబియ్యం సేకరిస్తున్నట్లు, నెలకు 200 క్వింటాళ్లు జమచేసి లారీ ద్వారా మహారాష్ట్రకు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. 300 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించినట్లు, నిందితుడు గంగారంపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై నరేష్, సిబ్బందిని సీపీ గౌస్ ఆలం అభినందించారు.

చిట్‌ఫండ్ సిబ్బంది వేధింపులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): డబ్బులు చెల్లించాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ వ్యక్తి ఇంటికి ఓ చిట్ ఫండ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం చేరుకుని వేధింపులకు దిగారని స్థానికులు పేర్కొన్నారు. ఇంటి ఎదుట సిబ్బంది వ్యవహరించిన తీరుపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిబంధనల మేరకు బాధితుడి నుంచి డబ్బులు వసూలు చేసుకోవాలని ఇంటికి వచ్చి ఇబ్బందులకు గురి చేయకూడదని పోలీసులు సూచించారు. ఇంటి ఎదుట గొడవకు దిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాంతో చిట్ ఫండ్‌కు చెందిన వ్యక్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

- 24మందికి జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు

కోల్‌సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 24 మందికి రూ.48వేల జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను గోదావరిఖని రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ గురువ విధించినట్లు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడగా అతనికి మూడు రోజుల జైలు శిక్ష విధించి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

44 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం

అజ్ఞాతాన్ని వీడిన మల్లోజుల వేణుగోపాల్‌రావు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, కేంద్ర కమిటీ సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ మెంబర్, అధికార ప్రతినిధి, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ చీఫ్ మల్లోజుల వేణుగోపాల్ అలి యాస్ సోనూ దాదా, అభయ్, భూపతి 44 ఏళ్ల అజ్ఞాతాన్ని వీడారు. ఆయనను పెద్దపల్లి పెద్దన్నగా ఈ ప్రాంత ప్రజలు భావిస్తారు. మంగళవారం రాష్ట్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, రూపేష్, పలువురు డివిజనల్ కమిటీ సభ్యులు 60 మంది మావోయిస్టులతో కలిసి మహారాష్ట్ర గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు.

● వరుస లేఖలతో కలకలం

రెండు నెలలుగా పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ మల్లోజుల విడుదల చేసిన లేఖలు కలకలం రేపాయి. ఆ లేఖలకు ప్రతిగా రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్, కేంద్ర కమిటీ సభ్యులు కట్ట రాంచంద్రా రెడ్డి, సత్యనారాయణరెడ్డి సాయుధ పోరాటాన్ని వీడేది లేదంటూ స్పష్టం చేశారు. ఆ తర్వాత మల్లోజుల వరుసగా లేఖలు విడుదల చేయడంతో ఆయన లొంగిపోవడం ఖాయమని అంతా భావించారు. వారం రోజుల క్రితమే ఆయన హైదరాబాద్ పోలీసులకు లొంగిపోయారనే వార్తలు వెలువడ్డాయి. వేణుగోపాల్‌రావు సోదరుడు కోటేశ్వర్‌రావు విప్లవోద్య



మల్లోజుల వేణుగోపాల్‌రావు (ఫైల్)

● దళ సభ్యుడి నుంచి పొలిట్ బ్యూరో వరకు

మంలోనే అమరడయ్యారు. ఆ సమయంలో 'అమ్మ.. నేను పారి పోను, ప్రజల కోసం ప్రాణం ఇస్తా..' అని అన్న వేణు గోపాల్‌రావు అనూహ్యంగా పోలీసులకు లొంగి పోవడం చర్చనీయాంశంగా మారింది. నిన్ను చూడాలంటూ.. పలు సార్లు కోరిన వేణుగోపాల్‌రావు తల్లి మల్లోజుల మధురమ్మ 2022 అక్టోబరులో అనారోగ్యంతో మృతి చెందింది. ఆ సమయంలో ఆయన వస్తాడని పలువురు భావించారు.

● కోటన్న స్ఫూర్తిగా..

పెద్దపల్లి పట్టణానికి చెందిన మధురమ్మ, వెంకటయ్య దంపతులకు మూడో సంతానంగా 1956 మే 10వ తేదీన మల్లోజుల వేణుగోపాల్ రావు జన్మించారు. పెద్దన్న ఆంజనేయులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. పెద్దపల్లి ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలు, భూస్వాములు, పెత్తందారుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ 1975లోనే కొండపల్లి సీతరామయ్య నాయకత్వంలో ఏర్పడిన సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌లో చేరారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకున్న వేణుగోపాల్ రావు 1981 ప్రాంతం లో అడవిబాట పట్టారు. పెద్దపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. 1977-78లో పెద్దపల్లి ఐటీఐలో రేడియో టీవీ కోర్సును అభ్యసించారు. అనంతరం బసంత్‌నగర్‌లో గల సిమెంట్ ఫ్యాక్టరీలో అప్రెంటీస్‌షిప్ చేశారు. ఆ తర్వాత బీకాం చదివారు.

● అజ్ఞాతంలో అగ్ర నేతలు..



పెద్దపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు ఉద్యమానికి కీలకంగా నిలిచిన ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అగ్రనేతలు పార్టీలో కొనసాగుతున్నారు. కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలోని పీపుల్స్‌వార్ పార్టీలో ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున యువకులు చేరారు. పెద్దపల్లికి చెందిన మల్లోజుల కోటేశ్వర్ రావు, మల్లోజుల వేణుగోపాల్ రావు, బీర్‌పూర్‌కు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు, కొత్తగట్టుకు చెందిన నల్లా ఆదిరెడ్డి, జగిత్యాలకు చెందిన శీలం నరేష్, కోరుట్లకు చెందిన తిప్పిరి తిరుపతి, మంథని శాస్త్రులపల్లికి చెందిన మల్ల రాజిరెడ్డి, మంగపేటకు చెందిన బుర్ర చిన్నన్న, దమ్మక్కపేటకు చెందిన ఏకే కొమురయ్య, గూడెం ప్రసాద్, వడుకాపూర్‌కు చెందిన పుల్లూరి ప్రసాదరావు, పద్మక్క ఇలా అనేక మంది కుటుంబాలను వదిలి అడవి బాట పట్టారు. కొండపల్లి సీతరామయ్య తర్వాత పీపుల్స్‌వార్ ప్రధాన కార్యదర్శిగా కేంద్ర కమిటీ ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి నియమితులయ్యారు. 2004లో సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భావానికి ముందు 15 ఏళ్ల పాటు గణపతి కార్యదర్శిగా కొనసాగారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా 2004 నుంచి 2018 వరకు పని చేశారు. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఉద్యమ ప్రస్థానంలో పలువురు అమరులయ్యారు. పొలిట్ బ్యూరో సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యులు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి అజ్ఞాతంలో ఉన్నారు.

● అంచలంచెలుగా ఎదిగి..

మల్లోజుల వేణుగోపాల్ పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల్లో అంచలంచెలుగా ఎదిగారు. 1981లో పీపుల్స్‌వార్‌లో ఏటూరు నాగారం దళ సభ్యుడిగా చేరారు. 1982లో మహదేవపూర్ పోలీసులు అరెస్టు చేశారు. 1983లో విడుదలైన తర్వాత తిరిగి దళంలోకి వెళ్లారు. 1993లో దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సెక్రెటరీగా, 1995లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పశ్చిమ కనుమలకు ఇరువైపులా కొత్త గెరిల్లా జోన్ ఏర్పాటు చేసేందుకు వేణుగోపాల్‌రావుకు పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. 2007 నుంచి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పని చేస్తున్నారు. 2010 ఏప్రిల్‌లో దంతేవాడలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందిన ఘటనకు ప్రధాన సూత్రధారి వేణుగోపాల్ అని చెబుతారు. అదే ఏడాది కేంద్ర అధికార ప్రతినిధిగా నియమించారు. కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా వేణుగోపాల్ బాధ్యతలు నిర్వహించారు. అభయ్ పేరిట లేఖలు విడుదల చేసేవారు. లాల్‌గఢ్ ప్రాంత ఉద్యమానికి, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా నాయకత్వం వహించారు. ఆయన సహచరి సిడాం విమలచంద్ర అలియాస్ తారక్క అలియాస్ వత్సల జనవరి 1న మహా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎదుట లొంగిపోయారు. సాహిత్యాభిరుచి ఉన్న వేణుగోపాల్ సాధన అనే కలం పేరిట కవిత్వం రాసే వారు.

జనజీవన స్రవంతిలోకి రావడం ఆనందంగా ఉంది..

- మల్లోజుల దిలీప్ శర్మ, వేణుగోపాల్ సోదరుడి కుమారుడు



మా బాబాయ్ అడవులను వీడి జన జీవన స్రవంతిలో కలవడం ఆనందంగా ఉంది. ఆయన ఎలా ఉంటారో ఇప్పటి వరకు నేను చూడ లేదు. ఆయన జన జీవన స్రవంతిలో కలవడాన్ని కుటుంబసభ్యులందరం స్వాగతిస్తున్నాం..

ఏసీబీ వలలో సర్వేయర్

- 3 ఎకరాల భూమి సర్వేకోసం రూ. 30 వేల లంచం
- సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో పట్టివేత



సర్వేయర్ వేణుగోపాల్, అసిస్టెంట్ సూర్యవంశీ



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరో అవినీతి అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిరిసిల్ల ఎమ్మార్వో కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న మేడిశెట్టి వేణుగోపాల్, ప్రైవేట్ అసిస్టెంట్ సూర్యవంశీ మంగళవారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇరుకుల్ల ప్రవీణ్ చిన్న బోనాలలో ఉన్న తన 3 ఎకరాల భూమి సర్వే నిమిత్తం సర్వేయర్ వేణుగోపాల్‌ను సంప్రదించారు. అయితే సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వడానికి వేణు ఏకంగా రూ. 30 వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం మూడు ఎకరాల భూమి సర్వే అయ్యాక ప్రవీణ్ మొదటగా రూ. 10 వేలు లంచం ఇచ్చాడు. మంగళవారం సర్వేయర్ ఫోన్ చేసి బ్యాలెన్స్ ఇస్తే రిపోర్ట్ ఇస్తా అని చెప్పడంతో సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయానికి ప్రవీణ్ వెళ్లి సర్వేయర్‌కు రూ.20 వేలు లంచం ఇస్తుండగా ప్రైవేట్ అసిస్టెంట్ సూర్య వంశీకి ఇవ్వమని చెప్పగానే ఏసీబీ అధికారులు దాడి చేసి ఇద్దరిని పట్టుకున్నారు. సర్వేయర్ వేణుగోపాల్, అసిస్టెంట్ సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ సర్వేయర్‌పై గతంలోనూ పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం బుధవారం ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఏసీబీ అధికారులు దాడులు మిగతా శాఖల అధికారులను కుదిపివేసింది.

కిరాణా దుకాణాల్లో పోలీసులు సోదాలు



కిరాణ దుకాణంలో పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని కిరాణ దుకాణాల్లో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. సారా తయారీకి వినియోగించే ముడి సరుకులు, గడువు ముగిసిన తినుబండారాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు జరిపారు. సరుకులు, ఇతర వస్తువుల అమ్మకాలకు సంబంధించిన వివరాల పట్టికలు కొనసాగిస్తున్నారా..? అని నిర్వాహకులను ప్రశ్నించారు. దుకాణంలో విక్రయించే వస్తువు వివరాలను నమోదు చేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గుడుంబా ముడి సరుకులు, జీరో వ్యాపారాలు నిర్వహిస్తే తమకు ప్రజలు సమాచారం అందించాలని కోరారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. వ్యాపారులు నిబంధనలను ఉల్లఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ఐ లక్ష్మణ్ హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మంథని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి గ్రామశివారులో ఇటుక బట్టి పరిసరాల్లో స్వర్ణపల్లి గ్రామానికి చెందిన ఉక్కు మహేష్(25) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇటుక బట్టీలో మోటారు మరమ్మతు కోసం సోమవారం సాయంత్రం మహేష్ అక్కడికి వచ్చాడు. పని అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయిన మహేష్ నీటి సంప్‌లో పడి మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే బహిర్భూమికి వెళ్లిన క్రమంలో ఫిట్స్ వచ్చి సంప్‌లో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



బాపు కొమురయ్య

సుల్తానాబాద్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు శాస్త్రినగర్‌లో రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. పూసాల గ్రామానికి చెందిన బాపు కొమురయ్య(79) మంగళవారం మధ్యాహ్నం శాస్త్రినగర్‌లో గల ఒక బ్యాంకులోకి వెళ్లి డబ్బులు డ్రా చేసుకుని తిరిగి రోడ్డు దాటుతున్నాడు. ఆర్టీసీ బస్సు అతన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వృద్ధుడు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కుటుబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

వేములవాడ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఎయిర్‌టెల్ సెల్ టవర్‌కు మంటలు వ్యాపించిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్థరాత్రి ఎయిర్‌టెల్ సెల్ టవర్‌కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన స్థానికులు ఆర్పివేసినట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

చందుర్తి అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ఏఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కిష్టంపేట గ్రామంలో పోలీసులను చూసి ఇసుక ట్రాక్టర్‌ను వదిలేసి పారిపోయిన కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన సద్దుల, అలియాస్ పత్రి పవన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి



వల్లెపు రాకేష్(ఫైల్)

సైదాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని గొడిశాల గ్రామానికి చెందిన వల్లెపు సంపత్ -పద్మల కుమారుడు వల్లెపు రాకేష్(25) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న రాత్రి రాకేష్ సినిమాకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ బంధువులు, చుట్టుపక్కల ఇళ్లలో వెతికారు. రాకేష్ ఆచూకీ తెలియక పోవడంతో ఈ నెల 13న రాకేష్ కనపడడం లేదని సైదాపూర్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం గొడిశాల గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో రాకేష్ మృతదేహం లభ్యమైందని తెలిపారు. తమ కొడుకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతి చెందాడని రాకేష్ తండ్రి వల్లెపు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను తీగల గుట్టపల్లి రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన కొత్తూరి రాజ్‌కుమార్, కొమురయ్య, సంపత్, అరవింద్, ఏలవేని వేణుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

వేములవాడ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపురం శివారు ప్రాంతంలో మంగళవారం వాగులో నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. కొద్ది రోజులుగా తిప్పాపురం వాగులో నుంచి వందలాది ట్రాక్టర్ల ఇసుక తరలిస్తూ చాలా ఇబ్బంది కలిగిస్తున్నారని రైతులు వాపోయారు. గుడి అభివృద్ధికి స్మశాన వాటిక ఇసుకను తరలించడం సరికాదని అన్నారు. వందలాది ట్రాక్టర్ల ఇసుక తరలించడం ఈ ప్రాంత రైతులకు ఎంతో నష్టాన్ని కలిగిస్తుందని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి తకు తగిన న్యాయం చేయాలని రైతులు కోరారు.

భూ తగాదాలతో పత్తి పంట ధ్వంసం



ధ్వంసం చేసిన పత్తి పంటతో కిషన్ నాయక్ దంపతులు

ధర్మారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలతో రెండు ఎకరాల పత్తి పంటను ధ్వంసం చేసిన ఘటన ధర్మారం మండలంలోని బొమ్మరెడ్డిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. మండలంలోని లంబాడితండా (బి) గ్రామస్థుడైన ఇస్లావత్ కిషన్‌నాయక్ 15 సంవత్సరాలుగా బొమ్మరెడ్డిపల్లి శివారులోని సర్వే నంబర్ 679లో దాదాపు 3 ఎకరాల భూమి సాగు చేస్తున్నాడు. సర్వే నంబర్ 679 ఆనుకొని ఉన్న 680 సర్వే నంబర్‌లో బంజేరుపల్లి గ్రామానికి చెందిన కుర్మ, యాదవ కుటుంబాలకు చెందిన దాదాపు 100 ఎకరాల పట్టా భూమి ఉంది. కాగా 679 సర్వే నంబర్‌లో ఇస్లావత్ కిషన్ నాయక్ సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి కూడా 680 సర్వే నంబర్‌కు సంబంధించిన పట్టా భూమి అంటూ పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ విషయమై ఇరువర్గాలు జూలైలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా పెద్ద మనుషుల సమక్షంలో సర్వే చేయించి భూమి సర్దుబాటు చేసుకుంటామని ఒప్పందపత్రం రాసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం భూమి వద్ద పత్తిచేను, బీర పంటలకు సాగు పనులు చూసుకొని సాయంత్రం వరకు ఇంటికి వచ్చామని, సోమవారం మధ్యాహ్నం వెళ్లి చూసే సరికి 2 ఎకరాల పత్తి పంటతో పాటు 20 గుంటల బీర తోట కోసేసి ఉందని కిషన్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై బంజేరుపల్లిలోని కొందరు పేర్లు పేర్కొంటూ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు కిషన్ నాయక్ పిర్యాదు చేశారు. భూ తగాదా పెద్ద మనుషుల సమక్షంలో ఉండగా ఇలా చేతికొచ్చిన పంటను కోయడం దారుణమని రైతు రోదించాడు. పత్తిపంట కోయడంతో తనకు లక్షా అరవై వేల రూపాయల నష్టం జరిగిందని, పంట నష్టం చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కిషన్‌నాయక్ కోరాడు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముకరంపుర ప్రాంతంలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న కట్టరాంపూర్‌కు చెందిన ఉప్పుల వెంకటరాజం అనే వ్యక్తితో పాటు గృహ యజమాని రిజ్వాన్‌లపై కేసు నమోదు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. ముకరంపుర ప్రాంతంలో వ్యభిచారం నడుస్తోందనే పక్కా సమాచారంతో ఆ గృహంపై దాడి చేయగా నిర్వాహకుడు, అతనికి సహకరించిన ఇంటి యజమానితో పాటు ముగ్గురిని పట్టుకున్నామని తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 1,100 రూపాయలు, సెల్‌ఫోన్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. శివరాజ్ అనే వ్యక్తి సెప్టెంబరు 9న బొమ్మకల్‌లో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నిలజీతో ఫోన్ హైదరాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం శివరాజ్‌కు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత ఆరు నెలల క్రితం మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్న ఇద్దరు బాధితులైన ఎల్ఎండీ కాలనీకి చెందిన పెండ్యాల సుధాకర్, చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన అనిల్ కుమార్‌లకు మంగళవారం ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఫోన్‌లను అప్పగించారు. ఎవరైనా తమ మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకున్నట్లయితే సిఐఈఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచించారు.

పాన్‌షాపులో చోరీపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని పాన్‌షాపులో చోరీ జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఖరీఫ్ రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నెల 13న రాత్రి తాళం వేసి ఇంటికి వెళ్లి తిరిగి ఈ నెల 14న ఉదయం పాన్ షాపుకు చేరుకున్నాడని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులకొట్టి అందులోని రూ.10 వేల విలువైన సిగరేట్ డబ్బాలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. బాధితుడు మహ్మద్ ఖరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

మహిళా యువ క్రికెటర్లకు సువర్ణ అవకాశం

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో అండర్-19 భారత జట్టుకు ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్



కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) యువ మహిళా క్రికెటర్లకు సువర్ణావకాశం కల్పిస్తోంది. భారత అండర్-19 మహిళా క్రికెట్ జట్టులో చోటు కోసం ఈ నెల 15, 16 తేదీల్లో ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇందులో ప్రతిభ చాటిన మహిళా క్రికెటర్లు 2025-26 సీజన్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొంది. పోటీల్లో పాల్గొనాలనుకునే మహిళా క్రికెటర్లకు అర్హతలను వెల్లడించింది.

● రిజిస్ట్రేషన్ వివరాలు

- ఈ నెల 15న ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. - మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రయల్స్. - ఈ నెల 16న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు రిజిస్ట్రేషన్, ట్రయల్స్ ప్రక్రియ.

● వేదిక

- హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, ప్రెస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ట్రయల్స్ నిర్వహిస్తారు.

- జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులు ఈ నెల 15న రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోనట్లైతే ఈనెల 16న నేరుగా హాజరై ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది.

● అర్హత

పోటీల్లో పాల్గొనేందుకు 1-9-2006 లేదా ఆ తరువాత జన్మించిన క్రికెటర్లకు మాత్రమే అవకాశం.

● పాటించాల్సిన నిబంధనలు

ఉప్పల్‌లోని స్టేడియం గేట్-1 వద్ద క్రీడాకారులు రిపోర్ట్ చేయాలి. ప్రతీ ఒక్కరు తమ క్రికెట్ కిట్, తెలుపురంగు దుస్తులు వెంట తెచ్చుకోవాలి. గుర్తింపు పత్రాలను తప్పక తీసుకురావాలి. వయస్సు ధ్రువీకరణ పత్రం ఒరిజినల్ డిజిటల్ కాపీతోపాటు ఒక జిరాక్స్ కాపీ, ఒరిజినల్ ఆధార్‌కార్డుతోపాటు ఒక జిరాక్స్ కాపీ, ఒక పాస్‌పోర్టుసైజు ఫొటో వెంట తెచ్చుకోవాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగమ్‌రావు, ఎస్.మురళీధర్‌రావు సూచించారు.



- నాలుగు నెలలుగా రైతుల ఎదురుచూపులు
- యాసంగి ధాన్యం బోనస్ బకాయి రూ. 62.6 కోట్లు
- వానాకాలంలో జోరుగా సాగు

కరీంనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించింది. సాధారణంగా వానాకాలంలో మాత్రమే సన్న రకం వరి రైతులు సాగు చేస్తారు. యాసంగిలో వరి గింజ తయారయ్యే దశలో ఎండలు ముదిరి నీరందక తాలు పోయే అవకాశమున్నందున ఆ సీజన్‌లో సన్న రకాలను సాగు చేసేందుకు ఆసక్తి చూపించరు.

● ఆందోళనలో అన్నదాతలు

వానాకాలంలో సీజన్‌లో రైతులు తాము ఇంటి అవసరాలకు వినియోగించుకోవడానికే కాకుండా మార్కెట్‌లో విక్రయించేందుకు తమ సాగు విస్తీర్ణంలో సుమారు 25 శాతం సన్న వరి రకాలను సాగు చేస్తారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈసారి 40 శాతం మేరకు సన్న రకాలను సాగు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వానాకాలంలో రైతులు 4.2 లక్షల ఎకరాల్లో సన్న రకాలను సాగు చేశారు. ఎకరాకు కనీసం 20 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వస్తుంది. ఈ మేరకు సుమారు 8.4 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలను ఈసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. వర్షాకాలంలో సాగు చేసిన వరి ధాన్యం మిల్లింగ్ సమయంలో నూకగా మారదు. దీంతో మిల్లర్లు ఎక్కువ ధర చెల్లించి ఈ ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం అందించే బోనస్ ప్రోత్సాహకరంగా ఉన్న నేపథ్యంలో ఒక్కో క్వింటాల్‌పై 500 రూపాయలు అధికంగా వస్తున్నందున రైతులు పెద్ద ఎత్తున సన్న రకాలను సాగు చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయి నాలుగునెలలు గడిచినా బోనస్ డబ్బును ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వానాకాలంలో బోనస్ ఇస్తుందా లేదా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బోనస్ ఇస్తేనే ప్రైవేట్ మార్కెట్ లో మిల్లర్లు అంతకంటే ఎక్కువ రేటు చెల్లించేందుకు ముందుకు వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం బోనస్ ఇవ్వక పోతే మిల్లర్లు ఆ బోనస్ డబ్బుల కంటే తక్కువగా చెల్లించి కొనుగోలు చేస్తారు. దీంతో రైతులు ఆశించిన విధంగా సన్న వరి రకాలకు ధర పలకదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి వరి ధాన్యం బోనస్ బకాయిల ను చెల్లించడంతో పాటు వానా కాలం బో నస్‌పై స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

● ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాసంగిలో 1,25,224 మెట్రిక్ టన్నుల దిగుబడి

ప్రభుత్వం క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో రైతులు ధైర్యం చేసి సన్నరకాల సాగును పెంచి 1,25,224 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించి కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు.కరీంనగర్ జిల్లాలో 32,694, పెద్దపల్లి జిల్లాలో 79,345, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8,786, జగిత్యాల జిల్లాలో 4,399 మెట్రిక్ టన్నులల సన్న రకం వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి విక్రయించారు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బును ప్రభుత్వం ఆయా రైతుల ఖాతాల్లో 15 రోజుల్లోగానే జమ చేసింది. ప్రోత్సాహకంగా ఇస్తామన్న క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్‌ను మాత్రం ఇప్పటికీ చెల్లించలేదు. కరీంన గర్ జిల్లా రైతులకు 16.35 కోట్లు, పెద్దపల్లి జిల్లా రైతులకు 39.67 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులకు 4.62 కోట్లు, జగిత్యాల జిల్లా రైతులకు 2.21 కోట్ల రూపాయల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉన్నది. జూన్ మొదటి వారంలోగానే యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. నాలుగు నెలలుగా రైతులు బోనస్ డబ్బులు జమ కాక ఇబ్బంది పడుతున్నారు. వాన కాలం సాగు అవసరాలకు ఈ డబ్బు ఉపయోగపడుతుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకు ఆ డబ్బును ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఎప్పుడు విడుదల చేస్తుందనే విషయం కూడా అధికారులు తెలపడం లేదు. నాలుగు నెలలు గడిచినా బోనస్ అందక పోవడంతో అసలు ఆ డబ్బు ఇస్తారా లేదా అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

17న రాజన్న కోడెల పంపిణీ

- కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ తిప్పాపూర్ గోశాలలోని రాజన్న కోడెలను ఈ నెల 17వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. గోశాలలోని 200 జతల కోడెలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసామని అన్నారు. రాజన్న సిరిసిల్లతో పాటుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులైన రైతులకు అందించాలని స్పష్టం చేసినట్లు తెలిపారు. కోడెలు కావాల్సిన రైతులు జిల్లా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ఐతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు సంబంధిత ధృవపత్రాలతో వివరాలు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని అన్నారు. కోడెలకు కోసం వచ్చే సమయంలో సంబంధిత పత్రాలు వెంట తీసుకు రావాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకుని, కోడెలను తీసుకోని వారు సరైన పత్రాలతో రావాలని కోరారు. రైతులకు అందించిన కోడెలకు జియో ట్యాగింగ్ ఉంటుందని, కోడెలు వెబ్‌సైట్‌లో రెతల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణం పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలు పక్కదారి పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

- రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి

తిమ్మాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తాం అని రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోహెడ చంద్రమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేవా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రావలసిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూటీ అందలేదన్నారు. ఉద్యోగ విరమణ పోందిన తరువాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని వాపోయారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవినపెడుతుందని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకేశాల ప్రభాకర్ రావు మాట్లాడుతూ పెన్షన్ బకాయిలు రాక ఇప్పటివరకు రాష్ట్రంలో 16మంది పెన్షనర్లు చనిపోయారని చాలామంది అనారోగ్యంతో హస్పిటల్‌లో డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో దీనావస్థలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకేశాల ప్రభాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గద్దె జగదీశ్వర చారి, కోశాధికారి కనపర్తి దివాకర్, పాలోజు రవీందర్, జాలి మహేందర్‌రెడ్డి, బూరుపల్లి రవీందర్, వీరగోని చంద్రమౌళి, గోగురామన్న, పెరిక నర్సయ్య, కరుణకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కవ్వంపల్లి వినతిపత్రం అందిస్తున్న రేవా నాయకులు

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ద్వితీయ స్థానం



ప్రహర్షిక

మానకొండూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రహర్షిక రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలలో ద్వితీయ స్థానం సాధించింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో జిల్లాస్థాయి జట్టులో సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రహర్షిక రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మోడల్ సాధించింది. కాగా గురువారం పాఠశాలలో ప్రహర్షికను ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అద్యాపక బృందం అభినందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడి నెలకొనగా వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాల పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి సెమినార్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక



అభయ్‌రాజ్

రాయికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పరిశోధనా శిక్షణ సంస్థ 'విద్యార్థుల యొక్క విద్యాపరమైన అభివృద్ధిలో కౌన్సెలింగ్ యొక్క పాత్ర' అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా పరిశోధన పత్రాలు ఆహ్వానించారు. రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ రూపొందించిన పరిశోధనా పత్రం 'ఒత్తిడి నుంచి విజయం వైపు-సమస్యల నుంచి పరిష్కారాల వైపు' ఎంపికైంది. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే సెమినార్‌లో అభయ్‌రాజ్ తన పరిశోధనా పత్రం ప్రదర్శించనున్నారని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు తెలిపారు.

గర్షకుర్తిలో యునిసెఫ్ బృందం పర్యటన



గ్రామస్థులతో మాట్లాడుతున్న జాతీయ యూనిసెఫ్ బృందం

గంగాధర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో మంగళవారం యూనిసెఫ్ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యాలయాల్లో పరిశుభ్ర పద్ధతులు, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల చేతులను సబ్బుతో కడుక్కోవడం వంటి అలవాట్లను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులతో పారిశుధ్యం, శుభ్రతపై వివరించారు. తడిపొడి చెత్తను వేరు చేయడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వ్యక్తి గత పరిశుభ్రత ఆరోగ్యాన్ని కాపాడుతుందని వివరించారు. బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని అందించాలని అన్నారు. బుధవారం నిర్వహించే గ్లోబల్ హాండ్ వాష్ డే సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మూడు రాష్ట్రాల యూనిసెఫ్ ఇన్‌చార్జి వెంకటేశ్, తెలంగాణ ఇన్‌చార్జి ఫణీకుమార్, జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రమేష్,వేణుప్రసాద్, ఎంపీడీవో రాము, ఎంపీవో గౌరీ రమేష్, కార్యదర్శులు, వీవోలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజన్న కోడెల గడ్డి మాయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజన్న కోడెల కోసం భక్తులు వందల కిలోమీటర్ల నుంచి తీసుకువచ్చిన ఎండు గడ్డి కట్టలను కొంత మంది స్థానికులు గుట్టుచప్పుడు కాకుండా మాయం చేస్తున్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి కోడెలకు రైతులు భక్తితో ఎండు గడ్డి కట్టలను విరాళంగా అందజేస్తారు. అలా వచ్చిన ఎండు గడ్డి కట్టలను మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామ శివారులో ఆలయాధికారులు నిల్వ చేశారు. అయితే నిల్వ చేసిన గడ్డి పక్కదారి పట్టకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో అనుపురం, నాంపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు రాజన్న కోడెల ఎండు గడ్డి కట్టలను మాయం చేస్తున్నారనే ఆరోపణలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. అంతే కాకుండా నిల్వ చేసిన గడ్డికట్టలపైకి ప్రైవేటు జీవాలను వదిలేసి మేపుతున్నారని తెలుస్తోంది. దీంతో రాజన్న కోడెల ఎండు గడ్డి కట్టలు పక్కదారి పట్టకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



నాంపల్లిలో నిల్వ చేసిన వరి గడ్డి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి, విస్తరణ పనుల తీరుతెన్నుల గురించి, కలికోట సూరమ్మ రిజర్వాయరు నిర్మాణ పనులపై చర్చించినట్లు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఆస్తి తీసుకుని అన్నం పెట్టడం లేదు

● పోలీస్‌స్టేషన్‌లో కొడుకుపై తల్లిదండ్రుల ఫిర్యాదు


హుజూరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని తీసుకొని వృద్ధాప్యంలో అన్నం పెట్టకపోవడంతో కొడుకుపై వృద్ధ దంపతులు మంగళవారం హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల రాజిరెడ్డి-ప్రమీల దంపతులు వృద్ధాప్యంలో ఉన్నారు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉండగా, వారికి వివాహం జరిపించారు. రాజిరెడ్డి తనకున్న సుమారు ఐదెకరాల భూమిని కొడుకు మహేందర్‌రెడ్డిపై రిజిస్ట్రేషన్ చేశారు. కొన్ని రోజులు తల్లిదండ్రులను సక్రమంగా చూసుకున్న కొడుకు, కోడలు ఇటీవల పట్టించుకోవడం మానేశారు. ప్రస్తుతం రాజిరెడ్డి, ప్రమీలలు వృద్ధాప్యంలో ఉండగా, ఆరోగ్యం సహకరించడం లేదు. నెలకు రూ. 2వేల పింఛన్ రావడంతో దానిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కొడుకు, కోడలు పట్టించుకోకపోవడంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. దీనిపై టౌన్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ కొడుకు మహేందర్‌రెడ్డిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, తల్లిదండ్రులను చూసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హుజూరాబాద్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద రాజిరెడ్డి-ప్రమీల వృద్ధ దంపతులు

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మంగళవారం వేకువజామున వర్షం కురిసింది. మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, పదిర, హరిదాస్‌నగర్, రంగంపేట, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యపు కుప్పలపై కప్పిన కవర్లలో నిలిచిన వర్షపు నీరును రైతులు తొలగించారు. తడిసిన ధాన్యాన్ని వేరు చేసి ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడ్డారు. కొనుగోళ్లను వేగవంతం చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాచర్లబొప్పాపూర్‌లో తడిసిన ధాన్యం

రాజీవ్ రహదారిపై వెలుగని సెంట్రల్ లైటింగ్

● చాలా చోట్ల పనిచేయని లైట్లు ● రాత్రివేళ ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-హైదారాబాద్ వెళ్లే రాజీవ్ రహదారిపై అలుగునూర్ నుంచి మహాత్మానగర్ వరకు సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పనిచేయడం లేదు. సెంట్రల్ లైటింగ్ పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో రాత్రి సమయంలో ఈ రహదారి వెంబడి ప్రయాణించేందుకు వాహణాదారులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం రాత్రి కూడా అలుగునూర్ నుంచి టోల్‌గేట్ హోటల్ వరకు దాదాపు 30 పోల్స్‌కు సంబంధించిన సెంట్రల్ లైటింగ్ వెలగ లేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే రాజీవ్ రహదారి వెంట నిత్యం వందల సంఖ్యలో వివిధ రకాల వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. రోడ్డుపై ఉన్న వివిధ గ్రామాల ప్రజలు రోడ్డు వెంట నడవాలన్నా భయపడుతున్నారు. అతివేగంగా రహదారిపై నుంచి వచ్చే వాహనాలతో చీకట్లో ఎక్కడ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ చీకట్లో సరిగా దారి తెలియక, మూల మలుపులు కూడా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో, ముందు ఏ వాహనం ఆగి ఉందో తెలియని పరిస్థితి మధ్య వాహనదారులు వాహనాలు నడుపుతున్నారు. చీకట్లో రోడ్డు ప్రమాదాలు జరిగిన రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో పోలీసులు కూడా తమ ఫోన్‌లలో లైట్ వేసి ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సుడా పరిధిలో రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ పూర్తి స్థాయిలో పనిచేసేవిధంగా మరమ్మతులు చేయాలని రోడ్డు వెంట ఉన్న గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై వెలగని లైటింగ్

19న ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉమ్మడి కరీంనగర్ జిల్లా (పెద్దపల్లి మినహా) సీనియర్స్ మహిళలు, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వై.మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో 17 సంవత్సరాలు నిండిన పురుషులు, 15 సంవత్సరాలు నిండిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను పెద్దపల్లిలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద

● 8 గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం మంగళవారం స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి 22,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతి కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 22,290 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. ఈ యేడాది జూన్ 1వ నుంచి 869.039 టీఎంసీల నీరు వచ్చింది.

పారదర్శకంగా చెల్లింపులు..

(5వ పేజీ)

గ్రామం నమోదు చేయాలి. ఫొటో క్యాప్చర్ ఆప్షన్ వస్తుంది. ఇంటి నిర్మాణం దశలు అడుగుతుంది. ఆ వివరాలు నమోదు చేయాలి. తర్వాత ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తర్వాత ఇంటికి సంబంధించిన జియో కోఆర్డినేట్ వివరాలు చూపుతుంది. వీటికి సంబంధించిన ఫొటోలు యాప్‌లో ఉంటాయి. ఎవరైనా తప్పుడు ఫొటోలు అప్లోడ్ చేస్తే స్థానిక అధికారులు, సిబ్బంది పరిశీలనలో బయటపడనుంది.

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై వైద్యులు రామకృష్ణ, వేణుమాధవ్ శిక్షణ ఇచ్చారు. వ్యక్తుల గుండె ఆగిపోయినపుడు, శ్వాస ఆగిపోయిన సందర్భంలో అత్యవసర చికిత్సలో భాగంగా సీపీఆర్ చేసే విధానంకు ముందు వ్యక్తి స్థితిని పరిశీలించాలని వైద్యులు సూచించారు.శ్వాసను పరిశీలించడం 120 సార్లు చేతులతో గుండెపై రెండు అంగుళాల వరకు 30 సెకండ్లకు రెండుసార్లు చొప్పున ఛాతిపైన నొక్కడంపై విద్యార్థులకు వైద్యులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయరఘునందన్‌రావు, ఆశలు, నోడల్ పర్సన్స్ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌వో సత్యనారాయణ, శాంతప్రణయ్, సాగర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలపై పట్టింపేదీ..?

- వర్షానికి తడిసిన ధాన్యం.. - ఇబ్బందులు పడుతున్న రైతులు - కొనుగోళ్లు చేపట్టాలని వేడుకోలు



రాచర్లబొప్పాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమైతే ఆనందపడే అన్నదాత ప్రస్తుతం ఆందోళన చెందుతున్నాడు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నాడు. కేంద్రాలకు తరలించి నిరీక్షిస్తున్నాడు. కంటాలు లేక కళ్లముందే వర్షానికి ధాన్యం తడిచిపోతే దిగులు చెందుతున్నాడు. కేంద్రాల్లో అన్నదాతల కొను'గోడు'ను పట్టించుకునే వారు కరవయ్యారు. కేంద్రాలను ప్రారంభించిన తూకం వేయకపోవడం వల్ల తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలంలో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. సరిపడా టార్పాలిన్లను అందించపోవడం వల్ల కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేసి తమ కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

కాంటాలు లేక తంటాలు..

మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, బండలింగంపల్లి, పదిర, నారాయణపూర్, కోరుట్లపేట, తదితర గ్రామాల్లో రైతులు పండించిన వరి ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వం ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కేంద్రాలను ప్రారంభించిన ఇంకా కొనుగోళ్లను చేపట్టలేదు. దాంతో కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చిన రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. కంటాలు లేక పోవడం వల్ల కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయిందని వాపోతున్నారు. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం విక్రయించేందుకు కేంద్రాలకు తరలిస్తే తమ 'గోడు'ను పట్టించుకునే వారే లేరని పేర్కొంటున్నారు. కనీసం ధాన్యం కుప్పలపై కప్పేందుకు టార్పాలిన్లు లేక అద్దెకు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. పనులు వదులుకుని ధాన్యం కుప్పల వద్ద వేచి చూస్తున్నామని పేర్కొంటున్నారు. తడిసిన ధాన్యం రంగు మారుతోందని కొనేందుకు కొర్రీలు పెడుతారేమోనని ఆరబెడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యం ఆరబెడుతున్నా..

- మల్లంగారి లష్మయ్య, రైతు, రాచర్లబొప్పాపూర్



నాకున్న ఐదెకరాల్లోని వరి పంట కోతకు రావడంతో నాలుగు రోజుల కిందట కోశా. ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రానికి తీసుకు వచ్చా. టార్పాలిన్లు లేక అద్దెకు తీసుకుని ఆరబెడుతున్నా. రాత్రి కురిసిన వానకు ధాన్యమంతా తడిసిపోయింది. చేసేదేమీ లేక తడిసిన ధాన్యాన్ని వేరు చేసి ఆరబెడుతున్నా.

నవంబరు 15న బాల కళోత్సవాలు..

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా 7వ బాల కళోత్సవాలను విజయవంతం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షుడు నక్క అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జిల్లా 7వ బాల కళోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కళాప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్ నటరాజరామకృష్ణ ఆశీస్సులతో లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని సీనారె కళామందిరంలో నవంబర్ 15వ తేది శనివారం ఉదయం జిల్లా 7వ బాల కళోత్సవాల(2025)ను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవే టు పాఠశాల విద్యార్థినీ, విద్యార్థుల కళను, సృజనాత్మను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న బాల కళోత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. బాల కళోత్సవాలలో చిన్నారులు 6 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పోటీలోని అంశాలు కూచి పూడి, ఆంధ్రనాట్యం, పేరిణి, సినిమా, క్లాసికల్, జానపదం, వెస్ట్రన్, దేశభక్తి నృత్య ప్రదర్శలకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు రెండు కన్సోలేషన్ బహుమతులు, సర్టిఫికెట్లు కూడా ఇస్తామదన్నారు. డాన్స్ టీచర్లకు పత్యేక సన్మానాలు ఉంటాయని పేర్కొన్నారు. బాల కళోత్సవంలో పాల్గొనే చిన్నారులకు మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తిగల బాలబాలికలు నవంబరు 5వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 9666343567లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో లంబోదర కల్చరల్ అకాడమీ ప్రధాన కార్యదర్శి కోత్వాల్ సాయిప్రశాంత్, ప్రోగ్రాం ఆర్గనైజర్ సిద్దుల హరీష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులను దూషించి వారిపై చర్యలు తీసుకోవాలి



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీడీ కార్మికులు

చందుర్తి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పట్టా భూమిలోకి వచ్చి బీడీ కార్మికులను దూషించి, దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని చందుర్తి మండల కేంద్రం బీడీ కార్మికులు మంగళవారం తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం సర్వేనంబర్ 504లో ఎకరం 20 గుంటల భూమి 30 మంది బీడీ కార్మికులు ఇళ్ల స్థలాల కోసం కలిగి ఉన్నామన్నారు. గతంలో భూమి ఆక్రమణకు గురికాగా అప్పటి అదనపు కలెక్టర్‌గా పని చేసిన యాస్మిన్ భాష స్థలం వద్దకు వచ్చి పరిశీలించి పట్టాలిచ్చారన్నారు. అయినా కొందరు వ్యక్తులు భూమి వద్దకు వెళ్లగా దూషించి, దాడికి యత్నిస్తున్నారని వారిపై చట్టరీత్య తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో బీడీ కార్మికులు దేవేంద్ర, జమున, అమృత, విమల, గంగవ్వ, లచ్చవ్వ శాంతవ్వ, పద్మ,అరుణ, ప్రమీల, కళావతి, పద్మ తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన అడ్మినిస్ట్రేటివ్ బృందం



గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన బృందం

గంభీరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం హైదరాబాద్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్‌కాలేజ్ ఆఫ్ ఇండియా బృందం సందర్శించింది. ఆసుపత్రిలో ప్రధానంగా వసతులు, సిబ్బంది తదితర అంశాలపై బృందం సర్వేచేసింది. ఇన్‌చార్జీ డాక్టర్ సందేష్ సభ్యులతో స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సృజన్, ఆర్ఎంవో డాక్టర్ సింధూజతోపాటు సిబ్బందితో ఆసుపత్రిలో కావల్సిన సదుపాయలపై చర్చించారు.


నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు ఇవ్వనున్నట్లు పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం పశువులకు రెండుసార్లు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని 13 మండలాల్లో 19 బృందాలు ఈ టీకాల పంపిణీ చేస్తాయన్నారు. కాగా, కోనరావుపేట మండలం పల్లిమక్తలో బుధవారం గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కలెక్టర్ ఎం హరితతో కలిసి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పశువులు ఉన్నవారందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవీం దర్‌రెడ్డి ప్రకటనలో కోరారు.

● చందుర్తి : చందుర్తి మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి శ్రీధర్ మంగళవారం తెలిపారు. ఈనెల 15న చందుర్తిలో, 16 మూడపల్లి, 17మాల్యాల, 18న మర్రిగడ్డ, 21న తిమ్మాపూర్, 22న రామన్నపేట, 23 నర్సింగాపూర్, 24 అనంతపల్లి, 25న ఆశిరెడ్డిపల్లి, 27న ఎనగల్, 28 బండపల్లి, 29 జోగాపూర్, 30 కిష్టంపేట, 31 సనుగుల, నవంబరు 1న కొత్తపేట, 3న లింగంపేట, 4న కట్ట లింగంపేట, 5న రామరావుపల్లి, 6న గోస్కులపల్లి, 7న దేవుని తాండ, 8నజలపతి తాండా టీకాల ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయంలో పారిశుధ్యలోపం

- చెత్తాచెదారం.. మూత్రశాలల నుంచి దుర్వాసన - ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మండల పరిషత్ కార్యాలయంలో ఓ మూలకు ఉన్న బ్యాలెటు బాక్స్‌లు, చెత్తాచెదారం

ఎల్లారెడ్డిపేట, అక్టో బరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో స్వచ్ఛతపై ప్రజలను చైతన్యపరచాల్సిన అధికారులే తమ కార్యాలయంలో పారిశుద్ధ్యం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. మూత్రశాలలు, కార్యాలయంలోని మూలలు అపరిశుభ్రంగా మారాయి. వివిధ పనుల నిమిత్తం ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ఆయా గ్రామాల ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు. మూత్రశాలల్లో నీటి పైపులు లీకేజీల వల్ల నీరు చేరుతోందని పేర్కొంటున్నారు. మూత్ర విసర్జనకు వెళ్లితే కాలు జారి పడిపోతామోనని భయాందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలోని ఓ మూలకు గతంలో వినియోగించిన బ్యాలెట్ బ్యాక్స్‌లను పడేశారు. అక్కడ చెత్తచెదారం పేరుకుపోయింది. మరోవైపు వర్షపు నీరు జల్లు వస్తుండడం వల్ల భవనం పైకప్పు రంగు పెచ్చులు పెచ్చులుగా ఊడిపోతోంది. పట్టించుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ కార్యాలయం అపరిశుభ్రతకు నిలయంగా మారుతోంది. గత్యంతరం లేక విధులు నిర్వహించాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు : ఎంపీడీవో సత్తయ్య

మండల పరిషత్తు కార్యాలయంలో నెలకొన్న పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. లీకేజీని పరిశీలించాలని పీఆర్ ఏఈకి సూచించాం. కార్యాలయంలో అక్కడక్కడ పడి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగిస్తాం. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

పౌష్టికాహారంతో రక్తహీనతను అధిగమించవచ్చు

చందుర్తి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనతపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌందర్య మాట్లాడుతూ రక్తహీనత రాకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ వ్యాసరచన పోటీలలో బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి శంకరమ్మ, కేజీబీవీ ఎస్‌వో కల్పన, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు భూజ్యోతి, అనసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి బానోతు అరవింద్‌ను పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకుని ఆ దిశగా ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని అడుగులు వేయాలని అన్నారు. విద్యార్థి అరవింద్ నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 75వ ర్యాంక్, ఆల్ ఇండియా 1005వ ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్ సీటు దక్కించుకోవడం అభినందనీయమని ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన చెప్యాల గౌతమి ఎంబీబీఎస్ సీటు సాధించగా మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెప్యాల గంగాధర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలగౌడ్, ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న దర్శనాలపై ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

చందుర్తి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):రాజన్న దర్శనాలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ అధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో పనుల్లో భాగంగా భక్తులకు దర్శనాలను, ఏకాంత సేవలుచేస్తూ అర్జిత సేవలు, భక్తులకు భీమన్న ఆలయంలోకి మార్చడం పట్ల బీజేపీ వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళనను, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనలను ప్రభుత్వం తీసుకొని హిందువుల మనోభావాలను దెబ్బతినకుండా రాజన్న ఆలయ ఆవరణలోనే దర్శనాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అభివృద్ధికి బీజేపీ ఎప్పుడూ ఆటంకం కాదన్నారు. భక్తులకు రాజన్నను దూరం చేస్తాం అంటేనే బీజేపీ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలె విజేందర్, ప్రధాన కార్యదర్శులు పెరుక గంగరాజు, మర్రి మల్లేశం నాయకులు గడిగొప్పుల జీవన్, కొక్కుల నరేష్, మొత్కుపల్లి రాజశేఖర్, చింతకుంట సాగర్,సిరికొండ తిరుపతి, కుసుంబ లింగారావు పెరుక రంజిత్, బోరుగయా తిరుపతి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : వేములవాడ రాజన్న ఆలయం ఆవరణలో భక్తులకు ఎల్ఈడీ తెరలపై దర్శనాలను ఏర్పాటు చేయడం హిందువుల విజయమని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయంలో దర్శనాలను నిలిపివేసి భీమేశ్వర దేవాలయంలో మొక్కులు చెల్లించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వ్యతిరేకిస్తూ బీజేపీ ఆందోళనలను చేపట్టిందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా దర్శనాలను ఆవరణలో ఎల్ఈడీ తెరలపై ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని లక్ష్మారెడ్డి అన్నారు. నాయకులు నరేశ్, బాలకృష్ణ, రాంరెడ్డి, తిరుపతి, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి ఉన్నారు.

● రుద్రంగి : బీజేపీ అభివృద్ధికి ఆటంకం కాదని పార్టీ మండల అధ్యక్షుడు కర్నావత్తుల వేణు అన్నారు. మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి ఆటంకం కాదని హిందువుల మనోభావాలు, ఆచారాలకు ఆటంకం కలిగిస్తే పోరాటం చేస్తుందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా గర్భగుడిలో అర్జిత సేవలు, దర్శనాలను నిలిపివేయడంపై బండి సంజయ్ సూచనల మేరకు ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. బిజెపి పార్టీ చేసిన ఆందోళనలకు రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి రాజన్న గర్భగుడిలో యాదావీధిగా ఆర్జిత సేవలు, దర్శనాలను కొనసాగిస్తున్నట్లు తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.



గంభీరావుపేటలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

● గంభీరావుపేట : మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు స్వీట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి రాజన్న దర్శనాన్ని కొనసాగించాలని నిర్ణయం తీసుకోవటాన్ని బీజేపీ నాయకులు స్వాగతించారు. దీనిపై స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పర్శాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, నాయకులు దేవేందర్, నాగరాజు, చంద్రం, శ్రీనివాస్, ప్రశాంత్, నవీన్, సతీష్ తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు దర్శనాలు కల్పించాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాలోతు లకపతినాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయ దర్శనాలు నిలిపివేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆలయం ఆవరణలో ఎల్ఈడీ తెరల ద్వారా దర్శనం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. నాయకులు నాగరాజు, లింబాద్రి, ప్రకాశ్, వెంకటేశ్, పెద్దిరాజు, రజనీకాంత్, మోహన్, అరవింద్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రచారానికి తరలిన బీఆర్ఎస్ నాయకులు

ఇల్లంతకుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లోని జుబ్లిహిల్స్ శాసనసభకు జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారానికి మండల బీఆర్ఎస్ నాయకులు వెళ్ళారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు జుబ్లిహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. వీరిలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు కేతిరెడ్డి వెంకటనర్సింహ్మారెడ్డితో పాటు వివిద గ్రామాల నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ బాకీ కార్డులతో బీఆర్ఎస్ ప్రచారం



ముస్తాబాద్‌లో బాకీ కార్డులతో బీఆర్ఎస్ నాయకులు..

ముస్తాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అలవి కాని హామీల బాకీ కార్డులతో అధికారంలోకి వచ్చి పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బాకీ కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచాక వాటి అమలును విస్మరించిందన్నారు. పేద ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మహిళలకు, దివ్యాంగులకు, వృద్దులకు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ, వంటి పథకాలతో మభ్య పెట్టి నిండా కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందన్నారు. ఓటు కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీసి అడగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ జనా బాయి, ఎద్దండి నర్సింహారెడ్డి, సంతోష్‌రావు, శీలం స్వామి, మెంగని మనోహర్, మెంగని స్వర్ణలత, దబ్బెడ రేణుక, కుర్ర సావిత్రి,కొమ్ము బాలయ్య, గూరురు భరత్, కొమ్మెట రాజమల్లు పూన బాలయ్య, దొరగొల్ల బాలయ్య, పాక బాల నర్సు కోడె శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, హరిదాస్‌నగర్, బుగ్గరాజేశ్వరతండా తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. కార్య క్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు లక్ష్మణ్‌రావు, సందీప్, శ్రీనివాస్‌రెడ్డి, పర్శరాములు, శ్రీనివాస్, తిరుపతినాయక్, వెంకటనర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, అజిమొద్దిన్, నాగరాణి, అనసూయ, గీతాంజలి, అప్స రున్నీసా పాల్గొన్నారు.

విద్యార్థినులకు తీరిన రవాణా కష్టాలు..



ప్రమాద నివారణ చర్యలు చేపట్టిన ఎస్ఐ, తహసీల్దార్ తదితరులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇసుక, మట్టి పేరుకుపోయి రవాణాకు ఆటంకం తలెత్తింది. వర్షాలు తగ్గు ముఖం పట్టడడంతో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఇసుక, మట్టిని తొలగించే పనులను మంగళవారం చేపట్టారు. స్థానిక ట్రాక్టర్ యజయానుల సహకారంతో ఇసుక, మట్టిని తొలగించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. విద్యార్థినీలు, ఉపాధ్యాయుల రవాణా సౌకర్యం మెరుగుపరిచారు. ఇసుక, మట్టిని తొలగడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఎంపీడీవో బీరయ్య, ఆర్ఐ శివకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు..

బోయినపల్లి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం ఆ పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్ దరఖాస్తు చేశాడు. సంఘటన సృజన అభియాన్ కార్యక్రమంలో భాగంగా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ఏఐసీసీ అబ్జర్వర్ శ్రీనివాస్ విమన్నే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష పదవి కోసం కూస రవీందర్ దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు గత 20 ఏళ్లుగా చేసిన కృషిని దరఖాస్తులో పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, నాయకులు జంగం అంజయ్య నాగుల వంశీ గౌడ్, కౌడగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలోనే భక్తులు దర్శించుకునేలా చూడాలి

కోనరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజన్న ఆలయంలోనే భక్తులకు దర్శనం ఇచ్చేలా చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం మాట్లాడారు. వేములవాడ రాజన్న ఆలయంలో అభివృద్ధి పనులను చేస్తున్నామని దర్శనాన్ని భీమేశ్వర ఆలయంలో భక్తులు దర్శనం చేసుకోవాలన్న ఆలోచనను పక్కకు పెట్టి రాజన్న ఆలయంలోనే భక్తులకు దర్శనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, జింక వెంకటి, చింతల పర్శరాములు, మోహన్, అబ్బసామి రాములు, లింగయ్య, వెంకటేష్, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మేధస్సును పెంపొందించేందుకే పోటీలు

కోనరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కనకమ్మ అన్నారు. కోనరావుపేట మండలం కొలనూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పోషక ఆహార పదార్థాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందజేసి మాట్లాడారు. విద్యార్థుల్లో మేధస్సును పెంపొందించేందుకు ఇలాంటి పోటీలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ సునీత, పద్మ, ఉపాధ్యాయులు రాధారాణి, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

17న కలెక్టరేట్ ఎదుట నిరసనలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని ఈనెల 17న కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని రేవా జిల్లా అధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో రేవా జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో పురుషోత్తం మాట్లాడారు. జిల్లాలో 2024 మార్చి నుంచి ఇప్పటివరకు రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చౌకి సుధాకర్, పట్టణ అధ్యక్షుడు టీవీ లక్ష్మణ్‌రావు, నాయకుడు దశరథం, రేవా జిల్లా ప్రధానకార్యదర్శి ద్యానపెల్లి పరమేష్, ఉపాధ్యక్షులు జన పాల శంకరయ్య, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు మద్దికుంట లక్ష్మణ్, కుబేర స్వామి, సభ్యులు సయ్యద్ మక్బూల్, సాదిత్ అలీ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం..

తంగళ్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు లైన్ల తదితర మెయింటనెన్స్‌తో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు లక్ష్మీపూర్, అంకుసాపూర్, పాపయపల్లె గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని ఏఈ కోరారు.